నైరుతి రైల్వేజోన్ జనరల్ మేనేజర్‌గా అరవింద్ శ్రీవాత్సవ

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వేజోన్ నూతన జనరల్ మేనేజర్‌గా అరవింద్ శ్రీవాత్సవ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేసిన ఆయన 1987లో ఇండియన్ రైల్వే స్టోర్స్ సర్వీస్ అధికారిగా చేరారు. వివిధ హోదాలలో సేవలందిస్తున్నారు. ఇంతవరకు ఆ స్థానంలో పనిచేసిన సంజీవ్ కిషోర్ గురువారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో అరవింద్ శ్రీవాత్సవ నియామకం జరిగింది. నూతన జనరల్ మేనేజర్‌కు అధికారులు, సిబ్బంది శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

రామేశ్వరం కెఫెలో పేలుళ్లు



రామేశ్వరం కెఫె వద్ద గుమికూడిన జనం

● 9 మందికి గాయాలు ● రంగంలోకి ఎన్ఐఏ, ఐబీ, ఫోరెన్సిక్ బృందాలు ● అనుమానాస్పద వస్తువులు స్వాధీనం

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైట్‌ఫీల్డ్‌కు అనుబంధంగా కుందలహళ్లి సమీపాన ఉన్న రామేశ్వరం కెఫెలో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుళ్లు సంభవించాయి. కుందలహళ్లి సమీపాన ఉండే ఐటీబీటీతోపాటు వివిధ కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులు మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సందర్భంలోనే పేలుడు జరిగింది. సుమారు ఒంటి గంట సమయంలో కెఫెలోని క్యాష్ కౌంటర్ సమీపాన ఉండే వాష్‌బేసిన్ వద్ద నిమిషాల వ్యవధిలో రెండుసార్లు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఒక్కసారిగా భారీ శబ్దం, పొగతో నిండిపోవడంతో హోటల్లో భోజనానికి వచ్చినవారు భయభ్రాంతులకు గురై పరుగులుదీశారు. మైక్రోచిప్ కంపెనీకి చెందిన ఐదుగురు ఉద్యోగులు ఒకే టేబుల్ వద్ద భోజనం చేస్తుండగా వారికి సమీపంలోనే పేలుడు చోటు చేసుకోవడంతో వారు గాయపడ్డారు. వీరిలో స్వర్ణ నారాయణప్ప, ఫారూక్, దిపాంశుతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. స్వర్ణ నారాయణప్ప స్పృహ కోల్పోయి కింద పడిపోవడంతో కాసేపటికే బయటకు తీసుకొచ్చారు. కెఫె సిబ్బంది కూడా నలుగురు గాయపడ్డారు. కెఫెలో పేలుడుతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన డీజీపీ అలోక్ మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బెంగళూరులో సుదీర్ఘకాలం తర్వాత పేలుడు సంఘటన చోటు చేసుకుంది. 2010 ఏప్రిల్ 17న చిన్నస్వామి స్టేడియం వద్ద, 2013 ఏప్రిల్‌లో మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం వద్ద పేలుళ్లు చోటు చేసుకున్నాయి. 2014 డిసెంబరు 28న చర్చి స్ట్రీట్‌లో బాంబు పేలుళ్లు సంచలనం కలిగించాయి. తొమ్మిదేళ్ల తర్వాత నగరంలో పేలుళ్లతో కలకలం చెలరేగింది. బెంగళూరు నగర వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రత్యేకించి మైసూరు, మంగళూరు, కారవారలో కీలకమైన ప్రాంతాలలో సాయుధబలగాలను మొహరింపచేశారు. శుక్రవారం రాత్రి వైదేహి ఆసుపత్రిలో క్షతగాత్రులను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పరామర్శించారు.


మీడియాతో హోంశాఖ మంత్రి పరమేశ్వర్


హుటాహుటిన తరలిన మంత్రులు

కుందలహళ్లిలో బాంబ్‌బ్లాస్ట్ సమాచారంతో హోంశాఖ మంత్రి పరమేశ్వర్, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కెఫెలో బాంబుపేలుడును తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఫోరెన్సిక్ నివేదిక అందిన వెంటనే కఠిన చర్యలు ఉంటాయని డీకే శివకుమార్ తెలిపారు. బాంబు పేలుడు వెనుక ఉన్న శక్తులను గుర్తిస్తామన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ పేలుడుకు సంబంధించి నిర్దిష్టమైన సమాచారం కోసం బృందాలు పనిచేస్తున్నాయన్నారు. బ్యాగుతో వచ్చిన వ్యక్తికి సుమారు 30 ఏళ్లు ఉంటాయన్నారు. కాగా స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే మంజులా లింబావళి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అనుమానాస్పద వస్తువులు స్వాధీనం

కెఫెకు రెండు బ్యాగులతో వచ్చినవారు వాష్‌బేసిన్ వద్ద ఓ బ్యాగును వదిలారు. అక్కడే పేలుడు సంభవించింది. బ్యాటరీ, వైర్లు, మేకులు, ఐడీ కార్డుకు సంబంధించిన ట్యాగ్ తదితర వస్తువులను గుర్తించారు. సమీపంలోనే మరో బ్యాగును కనుక్కొన్నారు. పేలుడు సమాచారం తెలియడంతోనే ఎన్ఐఏ అధికారులు, సీసీబీ, ఇంటెలిజెన్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. కెఫె ప్రాంతాన్ని పూర్తిగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు పేలుడుకు కారణమైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ అలోక్ మోహన్ మీడియాతో మాట్లాడుతూ పేలుడు జరిగినట్టు గుర్తించామని, మరిన్ని వివరాలకోసం సోదాలు చేస్తున్నామన్నారు. గాయపడిన బాధితులను వైదేహి మెడికల్ కళాశాల, మణిపాల్ ఆసుపత్రి, బ్రూక్‌ఫీల్డ్ ఆసుపత్రులకు తరలించామన్నారు. వీరిలో ఒకరి పరిస్థితి కొంత క్లిష్టంగా ఉందని మిగిలినవారికి చికిత్సలు కొనసాగుతున్నాయన్నారు. పేలుళ్లకు సంబంధించి జాతీయభద్రతా దళం, ఇంటెలిజెన్స్ బ్యూరోలకు సమాచారం ఇచ్చామన్నారు.






సీసీ కెమెరాల్లో రికార్డయిన పేలుడు దృశ్యాలు

కఠిన చర్యలు తీసుకుంటాం : సీఎం

రామేశ్వరం కెఫెలో పేలుడును తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెల్లడించారు. హాసన్, మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ హోటల్‌కు బ్యాగుతో వచ్చినవారు కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. 9 మంది గాయపడ్డారని, ఉగ్రవాద చర్యగా ఇప్పుడే ప్రకటించలేమన్నారు. పథకం ప్రకారం జరిపిన కుట్రగా తెలిసిందన్నారు. తమ ప్రభుత్వంలో జరిగిన తొలి పేలుడు అని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు.

10 సెకెన్ల వ్యవధిలోనే పేలుళ్లు : కెఫె ఎండీ దివ్య

పది సెకెన్ల వ్యవధిలోనే రెండుసార్లు పేలుళ్లు చోటు చేసుకున్నాయని రామేశ్వరం కెఫె మేనేజింగ్ డైరెక్టర్ దివ్య తెలిపారు. బయట నుంచి వచ్చిన వ్యక్తి బ్యాగు తీసుకొచ్చి పెట్టాడని తెలిపారు. కస్టమర్లు వాష్‌బేసిన్‌కు వెళ్లే చోట 12.55 గంటలకు పేలుడు జరిగిందన్నారు. బ్యాగుపట్ల తమకు అనుమానం ఉందన్నారు. గతంలోనూ రెండుసార్లు తమ కెఫెలో అనుమానాస్పద బ్యాగులను గుర్తించామన్నారు. ఒక బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు.

పేలుళ్లపై నిర్లక్ష్యం వద్దు : బీజేపీ

రామేశ్వరం కెఫెలో పేలుళ్లపై నిర్లక్ష్యం చేయరాదని ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. విజయేంద్ర మాట్లాడుతూ విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ అనేవారిని బయటకు పంపించే మార్గం చూపారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయన్నారు. కలబురగి జిల్లాలో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు బీజేపీ నాయకులను దారుణంగా హతమార్చారని మండిపడ్డారు. హత్యలు, దోపిడీలు, గుండాగిరీ, మహిళలపై దౌర్జన్యాలు రోజూ సాగుతున్నాయన్నారు. సుభద్ర కర్ణాటక ప్రమాదంలో పడేలా చేశారని మండిపడ్డారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ మై బ్రదర్స్ అంటూ ట్వీట్ చేయరాదని, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వైదేహి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ డీసీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్

బాధితుల వివరాలివే...

రామేశ్వరం కెఫె పేలుళ్ల ఘటనలో గాయపడిన వివరాలను పోలీసులు ప్రకటించారు. హోటల్ సిబ్బంది ఫరూక్ (19), అమెజాన్ ఉద్యోగి దీపాన్షు (23), స్వర్ణాంబ (49), మోహన్ (41), నాగశ్రీ (35), మోమి (30), బలరాం కృష్ణన్ (31), నవ్య (25), శ్రీనివాస్ (67) గాయపడ్డారు. వీరిలో స్వర్ణాంబకు 40శాతం గాయాలైనట్టు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజులా లింబావళి.. హోటల్ వద్ద గుమిగూడిన జనం

నిప్పుతో చెలగాటమాడొద్దు

● కులగణన నివేదికపై మాజీ సీఎం బొమ్మై హెచ్చరిక



బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికను ఒకవేళ ప్రభుత్వం ఆమోదిస్తే అది సమాజంలో అశాంతికి దారి తీస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని అంగీకరించొద్దని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రభుత్వానికి సూచించారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదిక ద్వారా ప్రభుత్వం నిప్పుతో చెలగాటమాడుతోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌కు హఠాత్తుగా 'అహింద' కులాలపై ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. 2017లో అప్పటి ప్రభుత్వం అన్ని కులాల విద్య, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయాలని సూచించిందన్నారు. కులగణన జరిపే అధికారంపై ఇంకా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. కులగణన ఉద్దేశ్యం ఒకటైతే దీన్ని రాజకీయకోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేశారని విరుచుకుపడ్డారు. 5.82 కోట్ల మందిని సంప్రదించిన అనంతరమే నివేదికను సిద్ధం చేసినట్టు చెబుతున్నారని, చాలామంది తమను ఎవరూ సంప్రదించలేదని ఆరోపిస్తున్నారన్నారు. కులగణనను తాము వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. కులాల ఆధారంగా ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. ఈ ఉద్దేశ్యంతోనే తమ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల ప్రమాణాన్ని గతంలో పెంచిందన్నారు. బలహీనవర్గాల జాబితాలో 150 కులాలు చేర్చారని, వీరికి రిజర్వేషన్ల ప్రమాణంపై చర్చ జరగాల్సి ఉందన్నారు. కమిషన్ నివేదికను రాజకీయ లబ్ధికోసం వినియోగించుకోరాదని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు. కులగణన నివేదికపై మంత్రుల మధ్యే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు మీడియా కథనాల ద్వారా తెలుస్తోందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం డబుల్‌గేమ్ ఆడుతోందని విరుచుకుపడ్డారు. ప్రభుత్వం స్వీకరించిన నివేదికలో రాష్ట్రంలో ముస్లిం జనాభా 70లక్షలకు పైగా ఉందని సూచించారని, అలా అయితే వారు మైనారిటీలు ఎలా అవుతారని ప్రశ్నించారు. కులగణన నివేదికపై ప్రభుత్వం సమగ్ర చర్చ జరపాలని, ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తీవ్రంగా వ్యతిరేకించిన ఒక్కలిగ సంఘం

కులగణన నివేదిక అశాస్త్రీయంగా ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని తాము ఆమోదించబోమని రాష్ట్ర ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు డి. హనుమంతయ్య ప్రకటించారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకవేళ ప్రభుత్వం ఈ నివేదికను అమలు చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన పోరాటానికి సిద్ధమన్నారు. ఎన్నికల వేళ హడావుడిగా నివేదికను ప్రభుత్వానికి సమర్పించడం వెనుక రాజకీయ కారణాలు కనిపిస్తున్నాయని విరుచుకుపడ్డారు. ఒక్కలిగ సంఘం రిజర్వేషన్ల కోసం గత కొద్దికాలంగా పోరాడుతోందన్నారు.

కేబినెట్‌లో చర్చించాకే తీర్మానం : సీఎం

కులగణన నివేదికను వ్యతిరేకించడం సరికాదని, కేబినెట్‌లో విస్తృతంగా చర్చ జరిగిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. హాసన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నివేదికపై అపస్వరాలు వినిపిస్తున్న అంశాన్ని తాను గమనించానని, నివేదిక అశాస్త్రీయమో కాదో తనకు తెలియదన్నారు. ప్రతిదాన్నీ ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీకి జాతీయ పురస్కారాలు

● మంత్రి రామలింగారెడ్డి



బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో తొలిసారి రోడ్డు రవాణా సంస్థకు చెందిన మొత్తం నాలుగు కార్పొరేషన్లకు జాతీయస్థాయి పురస్కారాలు దక్కాయి. ఈ మేరకు రవాణా, దేవదాయ శాఖల మంత్రి ఆర్. రామలింగారెడ్డి నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలిండియా స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ (ఏఎస్ఆర్టీయూ) 2022-23 సంవత్సరానికి గాను ప్రకటించిన పురస్కారాల్లో రాష్ట్రానికి 5 నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ఇందులో కేఎస్ఆర్టీసీని బ్రాండింగ్, సిబ్బంది సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలకు పురస్కారం లభించగా, బీఎంటీసీకి విద్యుత్ వాహనాల వాడకానికి గాను పురస్కారం దక్కిందన్నారు. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ, వాయువ్య కర్ణాటక రోడ్డు రవాణా సంస్థలకు ప్రయాణికుల సురక్షత కోసం చేపట్టి అమలు చేస్తున్న కార్యక్రమాలకు పురస్కారాలు దక్కాయి. ఈ పురస్కారాలను ఈనెల 15న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సమావేశంలో ప్రదానం చేయనున్నారు. పురస్కారాలు అందుకున్న నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్ల ఉన్నతాధికారులు, సిబ్బందిని మంత్రి రామలింగారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. 1965 ఆగష్టు 13న ప్రారంభమైన ఏఎస్ఆర్టీయూలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 62 రవాణా కార్పొరేషన్లు సభ్యత్వం కలిగి ఉన్నాయి.

జూన్‌లో 16 మంది ఎమ్మెల్సీల పదవీ కాలం ముగింపు




బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విధాన పరిషత్‌లో మరో మూడు నెలల తర్వాత భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. జూన్ 17, 22 తేదీలలో ఏకంగా 16 మంది సభ్యుల పదవీకాలం ముగియనుంది. కాంగ్రెస్ నుంచి ఐదుగురు, జేడీఎస్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి 8 మంది పదవీ కాలం ముగియనుంది. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన డాక్టర్ కె. గోవిందరాజు, అరవింద కుమార్ అరళి, కె. హరీశ్‌కుమార్, సభా నాయకుడు ఎన్ఎస్ బోసరాజు, డాక్టర్ చంద్రశేఖర్ పాటిల్, జేడీఎస్‌కు చెందిన మరితిబ్బేగౌడ, ఎస్ఎల్ బోజేగౌడ, బీఎం ఫరూక్ ఉన్నారు. ఇక బీజేపీకి చెందినవారిలో రఘునాథరావ్ మల్కాపుర, డాక్టర్ తేజస్విని గౌడ, కేపీ నంజుండి, ఎన్ రవికుమార్, రుద్రేగౌడ, తుళసి మునిరాజుగౌడ, ఆర్ దేవేగౌడ, డాక్టర్ వైఏ నారాయణస్వామి ఉన్నారు. వీరిలో జేడీఎస్‌కు చెందిన మరితిబ్బేగౌడ కాంగ్రెస్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దాదాపు ఆరేడు నెలలుగా జేడీఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ నేతలతో చట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నారు. బీజేపీలో ప్రముఖ నాయకురాలిగా గుర్తింపు పొందిన తేజస్వినిగౌడ కూడా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతోంది. కొత్తగా జూన్ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీకి పరిషత్‌లో బలం పెరగనుంది.

పన్నుల లక్ష్యాలతో వేధింపులు

● సామూహిక సెలవులతో బీబీఎంపీ సిబ్బంది నిరసన

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ రెవెన్యూ విభాగం అధికారులు పన్నుల టార్గెట్లతో వేధింపులకు గురిచేస్తున్నారని బృహత్ బెంగళూరు మహానగర పాలికె అధికారులు, ఉద్యోగల సంక్షేమ సంఘం ఆరోపించింది. ఉన్నతాధికారుల వేధింపులకు నిరసనగా శుక్రవారం రెవిన్యూ విభాగానికి చెందిన అధికారులు, ఉద్యోగుల సామూహికంగా సెలవు పెట్టి బెంగళూరు ఫ్రీడం పార్కులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎ.అమృత్‌రాజ్, ప్రధాన కార్యదర్శి కేజీ రవి మీడియాతో మాట్లాడుతూ 2022-23లో బీబీఎంపీ రెవెన్యూ అధికారులు సిబ్బంది ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రూ.3,339 కోట్లు, 2023-24లో రూ.3,646 కోట్ల మేరకు పన్నులను వసూలు చేశామని తెలిపారు. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో రూ. 307 కోట్ల మేరకు పన్నులు సేకరించామన్నారు. అయినా తమపై మానసిక ఒత్తిడి తెచ్చి వేధిస్తున్నారని, నిర్దిష్టమైన కారణాలు లేకుండా సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణం వేధింపులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉంచిన రెవెన్యూ అధికారులకు తక్షణం పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. వేధింపులు ఇలాగే కొనసాగితే ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తమ బాధలు నేరుగా చెప్పుకుంటామని తెలిపారు.


ఫ్రీడం పార్కులో బీబీఎంపీ సిబ్బంది ధర్నా



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.66	1,604.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	886	8,044
సామర్థ్యం (టీఎంసీలు)	8.46	28.69

రాజస్థాన్ కుండలకు భలే గిరాకీ!



మళ్లీ వేసవి వచ్చింది.. ఎండలూ వచ్చాయి..
ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటికెళ్తే ఎండవేడిమి..
పదేపదే నీటికోసం ఆగని దాహం
కాసిన్ని చల్లటి నీళ్లు దొరికితే ఆ ఆనందమే వేరు..
అదే.. కొత్త కుండలోని నీరైతే.. గటగటా తాగేస్తాం..
కడుపునిండా తాగి సేదదీరుతాం
అందుకే వచ్చేశాయి.. రాజస్థాన్ మట్టికుండలు
ఫ్రిజ్ నీటిని తలదన్నే చల్లదనం తమ సొంతమంటూ..
వాటిని కొనేందుకు జనం ఎగబడుతున్నారు..
తమకు పెరిగిన గిరాకీ చూసుకుని..
మురిసిపోతున్నాయి మట్టికుండలు - బళ్లారి రూరల్

వలస బాట..



పట్టణానికి వలస వెళుతున్న ప్రజలు

కంప్లి, మార్చి 1 : గ్రామాల్లో రోజు రోజుకు బ్రతకడానికి కష్టమవుతున్న తరుణంలో గ్రామాల్లో పనులు లేక జనం పట్టణాల బాట పడుతున్నారు. గంగావతి తాలుకా కారటగి, కనకగిరితో పాటు కంప్లి తదితర తాలుకాల్లోని గ్రామాల్లో పనులు లేక ప్రతినిత్యం జనం వలస వెళుతున్నారు. ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులు కల్పించినా గ్రామాల్లో అధికారులు మాత్రం తమకు అందుబాటులో వున్న వారికి మాత్రమే జాబ్‌కార్డులు ఇస్తున్నారన్న ఆరవణలు వినిపిస్తున్నాయి. రబీలో పొలాలకు నీరు లేక తమకు పూర్తిగా జీవనం గడిపేందుకు కష్టంగా మారిందని కూలీసోదరులు అంటున్నారు. అందువల్ల తాము పొట్ట గడిచేందుకు బెంగళూరుకు వెళుతున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హట్టప్ప

బళ్లారి సిటీ, మార్చి 01: మహిళలు చిన్న చిన్న స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి పీఎస్ హట్టప్ప అన్నారు. కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆవరణలో శుక్రవారం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద మహిళలకు టైలరింగ్ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ రకాల కొత్త డిజైన్లతో బట్టలు తయారు చేసే అలవాటును పెంపొందించుకుని మహిళలు సాధికారత సాధించాలని మార్గనిర్దేశం చేశారు. కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజాసాబ్ మాట్లాడుతూ మహిళలు పని ప్రదేశాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే శిక్షణకు సార్థకత అభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ సంచాలకులు విశ్వనాథ్, సిబ్బంది వినోద్, దుండేశ బడిగేర, మంజుళా సిద్దలింగమ్మ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మోదీ ఆశయాలను ప్రజలకు వివరిద్దాం



ఇంటింటి ప్రచారంలో విక్రమ్‌కుమార్ జైన్

సిరుగుప్ప, మార్చి 1: దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆశయాలను ప్రజలకు తెలియజేసే రోజులు వచ్చాయని బీజేపీ నగర అధ్యక్షుడు విక్రమ్ కుమార్ జైన్ అన్నారు. సిరుగుప్ప పట్టణం 16వ వార్డులో శుక్రవారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంచారు. పదేళ్లుగా మోడీ చేసిన సేవలను ప్రజలకు వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస, గంగాధర, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

హామీ పథకాలపై వీధి నాటకాలు



వీధి నాటకంలో ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, మార్చి1: సండూరు తాలూకా డీ. అంతాపూర్ గ్రామాల్లో సమాచార పౌరసంబంధాల శాఖ తరఫున దాత్రి రంగ సంస్థాన్ కళాబృందంచే వీధినాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు గ్రామంలో పర్యటిస్తూ, డోలు వాయిద్యాలతో ఆడుతూ, పాడుతూ ప్రభుత్వ హామీ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రత, నీటి వినియోగంతో పాటు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సభ్యులు, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ చూడామణికి పీహెచ్‌డీ



చూడామణి(ఫైల్)

బళ్లారిరూరల్, మార్చి 1 : బళ్లారి నగరంలో సరళాదేవి సతీష్ చంద్ర అగర్వాల్ ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాలలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న చూడామణి విజయనగరం జిల్లా శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ డిగ్రీ పట్టా పొందింది. వీఎస్‌కేయూలో సమాజ విజ్ఞాన విభాగం ఆచార్యులు డాక్టర్ అనంత్ ఎల్ ఝుండేకర్ మార్గదర్శనంలో చరిత్ర, పురాతత్వ విభాగంపై పరిశోధన చేయడంతో విశ్వవిద్యాలయం వారు ఆమెకు డాక్టరేట్ అందించారు. చూడామణికు పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టరేట్ పొందడంతో పలువురు అభినందించారు. ప్రొఫెసర్ చూడామణికు పీహెచ్‌డీ పట్టా పొందడంతో కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, మార్చి 1: జిల్లాలో మార్చి 3న నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలందరికీ తప్పకుండా టీకాలు వేసి జిల్లాలో వందశాతం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూరు సూచించారు. నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో జరిగిన జాతీయ పల్స్ పోలియో జిల్లాసమన్వయ కమిటీ రెండో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే నిర్ణయించినట్లుగా 1,97,103 మంది పిల్లలకు టీకాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. తొలిరోజు 100 శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ స్థాయిలో వ్యర్థాలను పారవేసే వాహనాల ద్వారా మైకింగ్, గ్రామాల్లో దండోరా వేయడం, పాఠశాల విద్యార్థుల జాతా ద్వారా ప్రజలకు మరింత ప్రచారం చేయాలన్నారు. మార్చి 3న జాతీయ పల్స్ వ్యాక్సిన్ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా 968 బూత్‌లు, 887గృహ సందర్శన బృందాలు, 51 ట్రాన్సిట్ టీమ్‌లు, 17 మొబైల్ టీములు, మొత్తం 1970మందిని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. ఇటీవల కేంద్రప్రభుత్వం పాముకాటును నోటిపై చేయదగిన వ్యాధిగా ప్రకటించడంతో పాముకాటు నివారణ, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య సంఘం సమావేశం ద్వారా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఆర్‌సీహెచ్ అనిల్‌కుమార్, జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి, జిల్లాకుటుంబ సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమణి, డాక్టర్ ఇంద్రాణి, గురునాథ్ చవాన్, తాలూకా ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

కులగణన అశాస్త్రీయం

మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి అసంతృప్తి



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుందరమూర్తి తదితరులు

బళ్లారి సిటీ, మార్చి 01: కులగణనపై నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల సర్వే అశాస్త్రీయమన్నారు. ఈసర్వే కరెక్టు కాదన్నారు. 130 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ నేడు భారతదేశంలో ప్రాంతీయ పార్టీలకు భిక్షగా మారిందని, ఇతర పార్టీలతో పొత్తులు బిక్షగా మారాయన్నారు. రానున్న లోకసభ ఎన్నికల్లో ఐఎన్‌డీఐఏ కూటమి 100సీట్లు కూడా గెలవదని అన్నారు. రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుస్సేన్ బళ్లారి మర్యాదను దేశంలో, రాష్ట్రంలో మంటకలపారన్నారు. పాకిస్తాన్ డిక్లరేషన్ కేసును కప్పిపుచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, నినాదాలు చేసిన వారిని చెప్పుతో కొట్టకుండా విచారణలో జాప్యం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా మారి ఖజానా ఖాళీ అయిందని, ఎస్సీఎస్టీ సొమ్మును మరెక్కడా ఉపయోగించకూడదని, కానీ అది జరుగుతోందన్నారు. దళారుల బెడద ఎక్కువైందని దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వయంగా సీఎంకు లేఖ రాశారన్నారు. జనార్దనరెడ్డి బీజేపీలో చేరడంపై సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జనార్దనరెడ్డిని చేర్చుకుంటే బాగుంటుందన్నారు. పార్టీలో చేరడం వెళ్ళిపోవడం ఆయన వ్యక్తిగత విషయమన్నారు. బళ్లారిలో ఓడిపోయామన్నారు. ఈసందర్భంగా మీడియా ప్రతినిధి డాక్టర్ బికే. సుందరమూర్తి. నాయకులు రామలింగప్ప, గుత్తిగనూరు విరూపాక్షగౌడ, శంక్రప్ప, శరణు తదితరులున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కంప్లి, మార్చి 1 : గ్రామాల్లో వేసవిని దృష్టిలో వుంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని గ్రామ అధికారులకు తాలుకా పాలనాధికారి శ్రీనివాసులు సూచించారు. కేడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో కొన్ని చోట్ల నీటి సమస్య తలెత్తుతోందని, ముందుజాగ్రత్తగా ఆ గ్రామాలో బోర్లను రిపేరి చేయించి ప్రజలకు సక్రమంగా నీటిని అందించాలన్నారు. అనంతరం రానున్న పరీక్షలను దృష్టిలో వుంచుకుని విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఆరోగ్య కేంద్రాలలో రోగులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ తాలుకా అధికారి మాట్లాడుతూ తమ తాలుకాలో ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు బాడుగ ఇళ్లల్లో వున్నాయని, అలాంటి ప్రాంతాల్లో అంగన్‌వాడీలకు స్థలాలు కేటాయించినట్లయితే నూతన కట్టడాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న ఎన్నికలలో తాలుకా స్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం పల్స్ పోలియో కరపత్రాలను విడుదల చేశారు. రెవెన్యూ, నీటి పారుదల, జెస్కమ్, పశువైద్య, వివిధ శాఖల అధికారులు కూడా తమ సమస్య ఆరా తీసి సమస్యలపై తెలియజేశారు. వాటిపై కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, తాలుకా ఈవో శ్రీకుమార్, ఏడీ మల్లన్నగౌడ, రత్నప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ వీరేష్, ప్రతాప్ కాలే, సంజీవయ్య, విద్యావతి, శ్రీధర్, కరేగౌడ, దయానంద పాల్గొన్నారు.



కేడీపీ సమావేశంలో పల్స్‌పోలియో కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరావు తదితరులు

హొసపేట, మార్చి 1: హొసపేట శ్రీ కృష్ణమఠంలో ఆదివారం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించినట్లు సంస్థకు చెందిన రాఘవేంద్రరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం హొసపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్వాచార్య మూలమహాసంస్థాన్, వామనతీర్థ సంప్రదాయానికి చెందిన శిరూరు మఠం జగద్గురువులు వేదవర్ధనతీర్థ శ్రీపాద మాట్లాడుతూ... విద్వాన్ కేశవాచార్యుల ఇంట్లో ప్రారంభమైన విష్ణుసహస్రనామ పారాయణ కార్యక్రమం నేటికి 20 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రతి వారం తప్పకుండా పారాయణ జరుగుతుందన్నారు. కరోనా వంటి భయంకరమైన వాతావరణంలో కూడా తమ సంస్థ ఆన్‌లైన్‌లో పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. సంస్థ అధ్యక్షులు నరసింహమూర్తి అధ్యక్షతన 1008 వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీపతి ఆచార్య, ఆర్పీ గురురాజ్, నరసింహాచార్య, రామమూర్తి ఆచార్ పాల్గొన్నారు.

శివరామ్ మృతి చలవాది సమాజానికి తీరనిలోటు



శివరామ్ సంతాపసభలో పాల్గొన్న అభిమానులు

సిరుగుప్ప, మార్చి 1 : రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చలవాది మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శివరామ్ మృతికి నివాళులర్పిస్తూ, చలవాది మహాసభ కార్యకర్తలు సంతాప సభ నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం, చలవాది మహాసభ కార్యాలయంలో శుక్రవారం ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చలవాది మహాసభ గౌరవాధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ శివరామ్ అధికార విధులలో ఉత్తమ సేవలు అందించారని ఆయన తెలిపారు. చలవాది మహాసభ ఎదుగుదలకు ఆయన ఒక కారణమన్నారు. సినీ నటుడిగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చలవాది మహాసభ అధ్యక్షులు సన్న రామయ్య, కోశాధికారి మల్లికార్జున, పదాధికారులు బసవరాజు, లక్ష్మణ, చలవాది మహాసభ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుడా చైర్మన్‌కు కమ్మసంఘం ఆధ్వర్యంలో సన్మానం



బుడా చైర్మన్‌ను సన్మానిస్తున్న సిరుగుప్ప తాలుకా కమ్మ సంఘం పదాధికారులు

బళ్లారిరూరల్, మార్చి 1 : బళ్లారి నగరంలో బెంగళూరు బైపాస్ గుగ్గిరట్టి రైల్వే ట్రాక్ వద్ద పలు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సలహాలతో శుక్రవారం గుగ్గిరట్టి రైల్వే గేటు, అలిపిరి మఠం తదితర కూడళ్లలో కూడా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్ల మరమ్మత్తులతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హోసూరు జోన్

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



మొక్క నాటుతున్న అభిమానులు

హోసూరు, మార్చి 1: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజు సందర్భంగా డీఎంకే నాయకులు, అభిమానులు శుక్రవారం వేడుకలు నిర్వహించారు. హోసూరు నగరంలో తొలుత డీఎంకే నేత, మాజీ సీఎం అన్నాదురై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి డీఎంకే పార్టీ నాయకుల కృషిని ప్రస్తావిస్తూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాదేశ్వరన్, చెన్నీరప్ప, డీఎంకే ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

ప్రవర్తన మార్చుకోవాలని పాత నేరస్థులకు హెచ్చరిక

హోసూరు, మార్చి 1: లోక్‌సభ ఎన్నికల వేళ శాంతిభద్రతలకు సంబంధించి పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. ఇందులో భాగంగా పాత నేరస్తులను బైండోవర్ చేసి ప్రవర్తన మార్చుకోవాలని, నేరాలకు మళ్లీ పాల్పడరాదని హెచ్చరికలు జారీ చేసింది. సరిహద్దులోని అత్తిబెలె పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లోని నిందితులను శుక్రవారం ప్రత్యేకంగా సమావేశపరిచారు. బెంగళూరు రూరల్ ఎస్పీ మల్లికార్జున బాలదండి మాట్లాడుతూ.. వారి తీరుపై నిఘా కొనసాగుతుందన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, మళ్లీ నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ బైక్‌ల కంటైనర్‌లో మంటలు

హోసూరు (మత్తిగిరి) మార్చి 1: హోసూరు సమీపంలోని మదగొండపలిలో ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ ప్రైవేట్ కంపెనీ నుంచి బయల్దేరిన ఒక కంటైనర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బెంగళూరు జయనగర్‌కు 40 ఎలక్ట్రిక్ బైక్‌లతో బయల్దేరిన ఈ కంటెయినర్ తళి రోడ్డులో ఉళివీరనపల్లి వద్దకు చేరుకోగానే మంటలు తలెత్తాయి. ప్రమాదంలో కంటెయినర్ పైభాగం డెక్‌లోని బైక్‌లు కాలిపోగా కింది డెక్‌లో ఉన్న బైక్‌లను మాత్రం రక్షించగలిగారు. 20 ఎలక్ట్రిక్ బైక్‌లు కాలిపోయాయని లక్షల్లో నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. ఘటనపై మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా గ్రామదేవతల కరగ ఉత్సవం

హోసూరు, మార్చి 1: హోసూరు నగరంలో గ్రామదేవతల కరగ ఉత్సవం ఘనంగా జరిగింది. 30కుపైగా గ్రామదేవతల ఉత్సవమూర్తులను పల్లకీలలో ఊరేగించారు. శుక్రవారం వేకువ జామున ఉత్సవం సాగింది. ప్రధాన రహదారుల నుంచి నేతాజీ రోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. మరగదాంబ చంద్రచూడేశ్వర స్వామి, కోట మారియమ్మ, కాళికాంబ, వినాయకుడు, అంజనేయస్వామి, తదితర దేవతలను ఊరేగించారు. భజన బృందాలు పాల్గొని తమిళ, కన్నడ, తెలుగు పాటలను ఆలపిస్తూ ఊరేగింపు ఉత్సాహంగా సాగేలా చేశారు. తేరుపేట ప్రాంతంలోని ధర్మరాజస్వామి ఆలయానికి కరగ చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గ్రామదేవతల ఊరేగింపు

ఆర్డీఏ అధ్యక్షుడిగా రాజశేఖర్ రామస్వామి



రాజశేఖర్ రామస్వామి (ఫైల్)

రాయచూరు, మార్చి 1: కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు రాజశేఖర్ రామస్వామి రాయచూరు నగరాభివృద్ధి సంస్థ (ఆర్డీఏ) అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఆర్డీఏ అధ్యక్ష పదవి కోసం జిల్లాలోని ఇద్దరు సీనియర్ నాయకులు రుద్రప్ప అంగడి, అయ్యణలు పోటీ పడగా చివరకు ఆ పదవిని రాజశేఖర్ రామస్వామి ఎంపికైయ్యారు. రాజశేఖర్ రామస్వామి రెండు రోజుల క్రితం కర్ణాటక సంప్రదాయేతర ఇంధన వనరుల మండలి అధ్యక్షుడిగా నియామకం కాగా ఆయనను ఆ స్థానం నుంచి తప్పించి తిరిగి ఆయనను ఆర్డీఏ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రారంభమైన పీయూసీ ద్వితీయ సంవత్సర పరీక్షలు



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

రాయచూరు, మార్చి 1: జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 42 కేంద్రాల్లో శుక్రవారం పీయూసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన కన్నడ పరీక్షకు మొత్తం 19060 మంది విద్యార్థులకు గాను 17962 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను విధింపజేయడంతోపాటు సమీపంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించామన్నారు.

అదుపుతప్పి బోల్తాకొట్టిన కారు

రాయచూరు, మార్చి 1: వేగంగా వెళుతున్న కారు డ్రైవర్ అదుపు తప్పడంతో బోల్తాకొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం జిల్లాలోని సిరవార తాలూకా అరకేరా సమీపంలో చోటు చేసుకుంది. అరకేరా నుంచి కలమలాకు వెళుతున్న కారు మితిమీరిన వేగంతో వెళుతూఒక్కసారిగా అదుపు తప్పి సమీపంలోని వరి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టగా డ్రైవర్ మాత్రం అదృష్టవశాత్తూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిరవార ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కాగా దేవదుర్గ సిరవార మధ్య రోడ్డు ఇటీవల అభివృద్ధి చేశారు. దీంతో వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతూ పలుసార్లు ప్రమాదాల బారిన పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా సిరవార పట్టణ సమీపంలోని మూలమలుపు వద్ద ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

సరోజినీ నాయుడు (వర్ధంతి)



'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించారు. కవయిత్రిగా మహాత్మాగాంధీచే 'భారతకోకిల'గా పిలవబడ్డారు. కాగా బాల సాహిత్యంతోపాటు దేశభక్తి, రొమాన్స్, ట్రాజెడీ తదితర అన్ని రకాల కవితలను రచించారు. స్వాతంత్రోద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు. డాక్టర్ గోవిందరాజులు నాయుడుతో వివాహం జరిగింది. సివిల్ రైట్స్, మహిళా సమస్యలపై గళమెత్తారు. 1925లో జాతీయ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నర్ కావడం విశేషం. 1949 మార్చి 2న కన్నుమూశారు.

కున్నకుడి వైద్యనాథన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత, శాస్త్రీయ సంగీత విద్వాంసులు కున్నకుడి వైద్యనాథన్ 1935 మార్చి 2న తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా కుంద్రకుడి గ్రామంలో జన్మించారు. అసలు పేరు వైద్యనాథన్ రామస్వామి శాస్త్రి. చిన్నతనం నుంచే నాదస్వర విద్వాంసులతో కలసి ప్రదర్శనలు ఇచ్చారు. వయోలిన్‌లో సరికొత్త పద్ధతులు ఆవిష్కరించారు. డోలు విద్వాంసులు వాలయపట్టి ఏఆర్ సుబ్రమణియన్‌తో కలసి 3వేలకు పైగా కచేరీలు ఇచ్చారు. తమిళంలో భక్తిపాటలకు ఎనలేని సేవలందించారు. కలైమామణి, సంగీత నాటక అకాడమీ, కర్ణాటక ఇసైజ్ఞాని, సంగీత కళాశిఖామణి తదితర పురస్కారాలు పొందారు. కొన్ని తమిళ సినిమాలలో అతిథిపాత్రలలో నటించారు. 'రాగ రీసెర్చ్ సెంటర్'కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2008 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

ఆనంద్‌జీ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కల్యాణ్‌జీ - ఆనంద్‌జీ సోదర ద్వయంలో ఆనంద్‌జీ 1933 మార్చి 2న గుజరాత్ రాష్ట్రం కచ్‌లో జన్మించారు. పూర్తిపేరు ఆనంద్‌జీ విర్జి షా. హిందీ సినీ సంగీత రంగంలో తమదైన ముద్రను చాటారు. 1956-1994 మధ్యన 250కు పైగా సినిమాలకు సంగీతం అందించగా 17 గోల్డెన్‌జుబ్లీ, 39 సిల్వర్ జుబ్లీ సాధించాయి. హీరో కిశోర్ కుమార్‌కు 270కుపైగా పాటలకు సంగీతం అందించారు. దేశ విదేశాలలో పలు స్వచ్ఛంద సంస్థలకోసం ఛారిటీ కార్యక్రమాలకు సంగీత కచేరీ నిర్వహించారు. సరస్వతీ చంద్ర సినిమాకు 1968లో తొలి జాతీయ పురస్కారం అందుకున్నారు. కాగా 2000 లో కల్యాణ్‌జీ కన్నుమూశారు. పలు పుర స్కారాలు అందుకున్నారు.

'టైగర్' ష్రాఫ్ (పుట్టినరోజు)



'టైగర్' ష్రాఫ్ 1990 మార్చి 2న ముంబైలో జన్మించారు. అసలు పేరు జై హేమంత్ ష్రాఫ్. బాలీవుడ్ హీరో జాకీష్రాఫ్, నిర్మాత అయేషాదత్‌ల కుమారుడు. 2014లో 'హీరోపంతి' సినిమాతో అడుగుపెట్టారు. 2016లో 'బాఘీ'తో కమర్షియల్ హిట్ సాధించారు. సీక్వెల్‌గా బాఘీ-2గా తీశారు. 2019లో 'వార్'తో ఇండియాలో రూ.300కోట్ల క్లబ్ జాబితాలోకి చేరారు. గ్లోబల్‌గా రూ.475కోట్లు వసూలైంది. కాగా టేక్వాండోలో బ్లాక్ బెల్ట్‌లో హానరరీ ఫిఫ్త్ డిగ్రీ పొందారు. నటుడిగా, డ్యాన్సర్‌గా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ప్రమోటర్‌గా రాణిస్తున్నారు. ఐఐఎఫ్‌ఏ అవార్డు, 2023లో స్టైలిష్ యాక్షన్ స్టార్ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు.


శివరాం పార్థివదేహానికి నివాళులర్పించిన విజయేంద్ర



నివాళులర్పిస్తున్న విజయేంద్ర

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర శుక్రవారం బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రలో రిటైర్డ్ ఐఏఎస్, సినీనటుడు కే శివరాం పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి తమ పార్టీకి తీరని లోటన్నారు. ఐఏఎస్ అధికారిగా ఆయన దళితులు, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. రవీంద్ర కళాక్షేత్రలో శివరాంకు పలువురు ప్రముఖులు, సినీరంగానికి చెందిన వారు ఘనంగా నివాళులర్పించారు.

ఉత్సాహంగా మ్యాచ్ డే



ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచే దిశలో రాష్ట్ర విద్యా శాఖ, బిటి గ్రూప్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన మ్యాచ్ డే 2024కు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని కబ్బన్ పార్కులో గల జవహర్ బాలభవన్‌లో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు నగరం నలుమూలల నుంచి 500 మందికి పైగా విద్యార్థినులు హాజరయ్యారు. బిటి గ్రూప్ ఇండియా డైరెక్టర్లు జై ముత్తు సుబ్రమణియన్, కపిల్ ఖనేజా, సంస్థ సామాజిక సేవల విభాగానికి చెందిన ఇయాన్ మెక్ బ్రైడ్, కోచ్ గెరార్డ్ జరగోజా, ఫుట్ బాల్ క్రీడాకారులు రెనెడీ సింగ్, కేజియా వీన్ డ్రాప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఫుట్‌బాల్ మెళకువలు నేర్పే శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు.

త్వరలోనే నాలుగేళ్ల సినిమా పురస్కారాలు

▸▸ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



బెంగళూరు ఫిలిమ్ ఫెస్టివల్ ప్రారంభంలో సీఎం తదితరులు

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలను త్వరలోనే ప్రదానం చేస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య హామీ ఇచ్చారు. 15వ బెంగళూరు ఫిలిమ్ ఫెస్టివల్‌ను విధానసౌధ ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు. పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, నటుడు శివరాజ్‌కుమార్, చలనచిత్రోత్సవ రాయబారి నటుడు డాలి ధనంజయ్, దర్శకుడు జబ్బార్ పటేల్, చెక్ రిపబ్లిక్ దేశ సినిమా విమర్శకులు మెయరా లాంగ్ రోవా, చిత్రోత్సవ ఆర్ట్ డైరెక్టర్ విద్యాశంకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల సంస్కృతి, అక్కడి జీవన విధానం తెలుసుకునేందుకు మానవత్వపు విలువల అవగాహనకు సినిమా మార్గదర్శకమని, అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు ఏటా విజయవంతంగా జరపడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోపాటు వివిధ దేశాలలో అమలులో ఉన్న రాజ్యాంగాలు, సామాజిక న్యాయం, నైతిక విలువలతో రూపొందించే సినిమాలు సమాజానికి సందేశమిస్తాయన్నారు. కువెంపు ఆలోచన అయిన విశ్వమానవ సంస్కృతి అమలులోకి వచ్చేలా వాతావరణం ఏర్పడాలన్నారు. వివిధ దేశాల సినిమాల ద్వారా సందేశం, అక్కడి జీవనశైలి తెలుసునేందుకు వీలుంటుందన్నారు. సినిమా సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు కారణమవుతోందన్నారు. సినిమాను చూసేవారిని బట్టి ఆలోచనల ప్రభావం ఉంటుందన్నారు. ప్రభుత్వ అదనపు కార్యదర్శి శాలిని రజనీశ్, చలన చిత్ర అకాడమీ ఛైర్మన్ సాధుకోకిల, చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షుడు ఎన్ఎం సురేశ్ పాల్గొన్నారు.

నూతన రథం పనులకు శ్రీకారం



జోడింపు ప్రక్రియ పూజల్లో ట్రస్టు పదాధికారులు

చింతామణి, మార్చి 1: పట్టణంలోని ప్రసిద్ధ దేవాలయం ఆజాద్‌చౌక్‌లోని హరి హరేశ్వస్వామి ఆలయ ఆవరణలో ఉమామహేశ్వరస్వామి ఆలయానికి 300 ఏళ్లనాటి రాతి చక్రాలు కల్గిన రథం అవసాన దశకు చేరడంతో నూతన రథం నిర్మాణ పనులు చేపట్టారు. లేట్ లక్ష్మీదేవమ్మ, సుబ్బరాయప్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 20లక్షల రూపాయలతో రథాన్ని సిద్ధం చేశారు. ఏప్రిల్‌లో జరిగే రథోత్సవానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రథం జోడింపు పనులను గురువారం లాంఛనంగా చేపట్టారు. 2023 ఫిబ్రవరి 10న రథం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రథం విడిభాగాలు సిద్ధం కావడంతో వీటి జోడింపు ప్రక్రియను ప్రారంభించారు. కనీసం వారం రోజుల పాటు జోడింపు పనులు సాగుతాయని అంచనా. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ వీ కోటకు చెందిన శిల్పి మహేంద్ర, చంద్రశేఖర్‌లు రథాన్ని 8 నెలల్లో పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం కూడా 300ఏళ్ల నాటి చక్రాలను కొనసాగించేలా నిర్ణయం తీసుకుని వాటి జోడింపు ప్రక్రియ చేపట్టడం విశేషం. దేవాలయ ట్రస్టు పదాధికారులు చంద్రప్ప, జగదీశ్, ఉమా మహేశ్వరి, చంద్రశేఖర్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ లిఫ్ట్, మొబిలిటీ వరల్డ్ ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ లిఫ్ట్, మొబిలిటీ వరల్డ్ 2024 ప్రదర్శన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. విర్గో కమ్యూనికేషన్స్ ఎగ్జిబిషన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. అంతర్జాతీయస్థాయిలో బహుళ ప్రాచుర్యం పొందిన సాంకేతిక పరికరాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఎలివేటర్ల మార్కెట్ క్రమేపీ విస్తరించుకుంటోందదని విర్గో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అనితా రఘునాథ్ మీడియాకు చెప్పారు. నిర్మాణరంగ ప్రగతితో ఎలివేటర్ల మార్కెట్ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఈ ప్రదర్శనలో నూతన సాంకేతిక ఆవిష్కరణలు అందుబాటులో ఉన్నాయని వీటి సురక్షతపై వినియోగదారులకు మరింతగా అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేస్తున్నామన్నారు. దేశవిదేశాలకు చెందిన 130కు పైగా ఎగ్జిబిటర్లు తమ అత్యాధునిక పరికరాలను ఈ ప్రదర్శనలో ఉంచారన్నారు. నిపుణులతో ప్రత్యేక చర్చాగోష్టులు, బిజినెస్ సదస్సులు, నూతన సాంకేతికత పరిచయం వంటి పలు కార్యక్రమాలు ప్రదర్శనలో భాగంగా ఏర్పాటవుతున్నాయన్నారు. ఈ ప్రదర్శనను కనీసం 3వేల మంది తిలకించవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు. ఎలివేటర్ల రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక పరిణామాలను నగర ప్రజలకు పరిచయడం చేయడమే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

కులగణన నివేదికను అంగీకరించే ప్రసక్తే లేదు : శ్యామనూరు



శ్యామనూరు శివశంకరప్ప

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికను అంగీకరించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున తండ్రి శ్యామనూరు శివ శంకరప్ప తేల్చి చెప్పారు. బెంగళూరులో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదికను అంగీ కరించేది లేదని మేం చూస్తూ కూర్చొని ఉండే వారం కాదన్నారు. అఖిలభారత వీరశైవ మహాసభ అధ్యక్షుడిగా నాకు బాధ్యతలు ఉన్నాయన్నారు. శాస్త్రీయంగా సర్వే జరుగలేదన్నారు. 9 ఏళ్ళ కిందట నివేదికను ప్రస్తుతం మరోసారి తీసుకువచ్చారని నివేదికను ఒప్పుకునేది లేదన్నారు. కులగణన నివేదిక ఇంట్లో కూర్చొని తయారు చేశారంటూ తీవ్రమైన ఆరోపణ చేశారు. రాష్ట్రంలో వీరశైవ, లింగాయతులు రెండుకోట్ల మందికి పైగా ఉన్నారన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే సంఖ్య తక్కువ చేశారన్నారు. మా సమాజానికి చెందిన వారిని కేవలం 65లక్షలుగా మాత్రమే చూపారన్నారు. ఇదో తప్పుడు, అబద్ధాల నివేదిక అన్నారు. పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. మేం ఎస్సీ ఎస్టీలకే కాకుండా ఏ సమాజానికి చెందిన వారికి వ్యతిరేకం కాదన్నారు. ఈ నివేదికతో కులాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంటుందన్నారు. అవసరమైతే ప్రైవేట్ సర్వే జరిపించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎన్నికలలో మంచి జరుగుతుందో లేదో చెప్పలేనన్నారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలోను నివేదికను అంగీకరించేది లేదన్నారు. ఇది కాంతరాజు నివేదిక అని మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై వాస్తవమే చెప్పారన్నారు. అదే నివేదికను జయప్రకాష్‌హెగ్డే ఇచ్చారన్నారు. మా కుటుంబం నుంచి లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసే విషయం ఇంకా నిర్ధారించలేదని అధిష్ఠానం నిర్ణయాన్ని పాటిస్తామన్నారు.

నేడు 'మసీదు దర్శన'



మీడియా సమావేశంలో జుబేర్ అహ్మద్ తదితరులు

బాగేపల్లి, మార్చి 1: సమాజంలో హిందూ ముస్లింల మధ్య సామరస్యం మరింత పెంచేలా 'మసీదు దర్శన' కార్యక్రమాన్ని శనివారం చేపడుతున్నట్టు కర్ణాటక జమియ్యత్ ఏ ఉలామా సంఘం ప్రముఖులు జుబేర్ అహ్మద్ వెల్లడించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ మసీదు కార్యకలాపాలపై ఉన్న అపోహలను తొలగించడంతోపాటు ఇస్లాం ధర్మంపై తప్పుడు భావాలను దూరం చేసేలా ఈనెల 2న మధ్యాహ్నం 3 గంటలనుంచి రాత్రి 9వరకు మసీదు దర్శన కార్యక్రమం చేపట్టామన్నారు. రాత్రి 7 గంటలకు భోజన వ్యవస్థ కల్పిస్తున్నట్టు తెలిపారు. కులమతాలకు అతీతంగా మహిళలు, చిన్నారులు సహా అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. మసీదులలో ప్రార్థనలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వివిధ సామాజికవర్గాల మధ్య ఉన్న దూరాన్ని తొలగించడమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. మీడియా సమావేశంలో ఫారూక్ మసీదు సమితి అధ్యక్షుడు బషీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు వజీర్, మౌలానా రియాజుద్దీన్ జమియ్యత్ ఏ ఉలామా కర్ణాటక సంఘం ప్రముఖులు హైదరాలి, అక్రమ్, బీఖ్యారు షఫి, ముతాహీర్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స



మీడియాతో వైద్యబృందం, చిన్నారి కుటుంబం

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు శేషాద్రిపురంలోని అపోలో ఆసుపత్రిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. దేశంలోనే తొలిసారిగా ఏకకాలంలో కాలేయం, మూత్రపిండాల మార్పిడి చేసేందుకు అక్వాడెక్స్ అనే సాంకేతిక విధానాన్ని అనుసరించినట్టు వైద్యబృందం శుక్రవారం మీడియాకు తెలిపింది. పుట్టుకతోనే హెపాటిక్ ఫైబ్రోసిస్, ఆటోసోమల్ రెసెసివ్ పాలిసిస్టిక్ అనే సమస్యతో ఈ చిన్నారి అలమటిస్తూ వచ్చింది. ఆరేళ్లప్రాయంలో ఉండగా దీన్ని గుర్తించారు. వంశపారంపర్యంగా ఈ సమస్య ఉద్భవిస్తుంటుందని వైద్యులు తెలిపారు. చెన్నైకు చెందిన వైద్యనిపుణుల సిఫారసు మేరకు ఈ చిన్నారికి 14ఏళ్ల దాత ఇచ్చిన కిడ్నీ, కాలేయాన్ని విజయవంతంగా అమర్చామన్నారు. ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ టీ మనోహర్, డాక్టర్ ఎన్ అరుణ్‌కుమార్, డాక్టర్ సంజయ్ గోవింద్, ఉదయ్‌దావడా, సీఈఓ డాక్టర్ మనీశ్‌మట్టు మీడియాతో మాట్లాడారు. చికిత్స అనంతరం చిన్నారి పూర్తిగా కోలుకుందని ఇక ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని తెలిపారు.

రూ.10 కోట్లతో తారు రోడ్డు పనులు

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరు నుంచి చిలకలనేర్పువరకు తారు రోడ్డు పనులకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సుమారు 6 కిలోమీటర్ల మేర చేపట్టే తారు రోడ్డు పనులకు రూ.10కోట్లు ఖర్చు కానుందన్నారు. కొన్నేళ్లగా దుస్థితిలో ఉన్న రోడ్డును బాగు చేసేందుకు ఎట్టకేలకు శంకుస్థాపన చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు చలం, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు రాము, వెంకటరమణ, చాకవేలు మాజీ సర్పంచ్ చిన్నరామిరెడ్డి, పులగల్లు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

బంగారపేట, మార్చి 1: వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని తాలూకాలోని హులిబెలె గ్రామపంచాయతీ అధ్యక్షురాలు ఆశా అధికారులకు సూచించారు. శుక్రవారం ఏర్పాటైన సాధారణ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ఆదాయం, ఖర్చులు, వివిధ పనుల ప్రగతి, పెండింగ్‌లో ఉన్న కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని, బోర్ల మరమ్మత్తు, రీబోర్లకు సంబంధించిన కార్యాచరణను అమలు చేయాలన్నారు.

హెబ్బాళ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పునఃప్రారంభం

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏకైక ప్రధాన మార్గమైన హెబ్బాళ్ బ్రిడ్జ్ వద్ద నిత్యం రద్దీ ఉంటుంది. సమస్యను పరిష్కరించాలని హెబ్బాళ ఫ్లై ఓవర్‌ను ఏడు నెలలక్రితం పనులు ప్రారంభించినా పలు కారణాలతో వాయిదా పడింది. ప్రస్తుతం మరోసారి నిర్మాణాలు కొనసాగించేందుకు సిద్ధమయ్యారు. ఎయిర్‌పోర్ట్ మార్గం నుంచి బెంగళూరువైపు వచ్చేందుకు మూడు లేన్‌లతో నిర్మాణాలు జరిపి ఓ వైపు కేఆర్‌పురం, మరోవైపు యశ్వంతపుర, నేరుగా వచ్చే మార్గం సిటీలో ప్రవేశించేలా ఏర్పాటు చేయదలిచారు. బీడీఏ సదరు నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమై ఆర్థికతోపాటు పలు సమస్యలు తలెత్తడంతో వాయిదా వేశారు. హెబ్బాళ్ ఫ్లై ఓవర్ విస్తరణ అంశం దశాబ్దకాలంగా ప్రస్తావనలో ఉంది. 2023 జూలైలో పనులు ప్రారంభించి ఆపేశారు. ఎస్టీమ్‌మాల్ నుంచి హెబ్బాళ బాప్టిస్ట్ ఆసుపత్రి దాకా మూడు లేన్‌లతో ఫ్లై ఓవర్ నిర్మాణాలకు రూ.350 కోట్లు అంచనా వేశారు. తొలి విడత పనులకు రూ.94కోట్లు ఖర్చు చేయదలిచారు. ప్రస్తుతం నిధుల కొరత లేదని పనులు ప్రారంభిస్తామని బీడీఏ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం హెబ్బాళ్ ఫ్లై ఓవర్‌పై రెండు లేన్‌ల మార్గం ఉంది. దీన్ని మూడు లేన్‌లకు విస్తరింపచేస్తే ట్రాఫిక్ సమస్యను కొంతమేర అదుపు చేయవచ్చునని భావిస్తున్నారు. నగరంలోని కుమారకృప, బసవేశ్వర సర్కిల్ మార్గంగా వచ్చే వాహనాలన్నీ మేఖ్రి సర్కిల్ దాకా చేరుకుంటాయి. కంటోన్మెంట్, యశ్వంతపురవైపు నుంచి వచ్చే వాహనాలు మేఖ్రి సర్కిల్‌లో కలుస్తాయి. సిటీ నుంచి హెబ్బాళవైపు వెళ్లే వా హనాల రద్దీ కొంత మెరుగు అనిపించినా యలహంకవైపు నుంచి జాతీయ రహదారితోపాటు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వేలాది క్యాబ్‌లతో నిత్యం రద్దీగా ఉంటుంది. హెబ్బాళ ఫ్లై ఓవర్‌ను విస్తరింపచేయడమే పరిష్కారంగా భావించారు.

కారుణ్య మరణాలకు అవకాశం కల్పించండి

▸▸ రాష్ట్రపతికి పోలీసులు, వారి పిల్లల లేఖ

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేసే సామాన్య పోలీసులకు నాలుగేళ్ళుగా బదిలీలు లేకుండా కుటుంబీకులను దూరంగా ఉంచారని అంతకంటే కారుణ్య మరణాలకు అవకాశం కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర పోలీసు సిబ్బంది వినతి పంపారు. పోలీసుశాఖలో నాలుగేళ్ళుగా బదిలీలు లేవని ఉద్యోగం ఒకచోటున, భార్య పిల్లలు మరో చోటున నివసించే పరిస్థితి కొనసాగుతోందని లేఖలో స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఎక్కువ మంది పోలీసుల తల్లిదండ్రులు సొంతూళ్ళలోనే ఉన్నారని వారిని కనీసం చూసుకునే అవకాశం కూడా లేదని లేఖలో ప్రస్తావించారు. బదిలీల కోసం దరఖాస్తులు చేసుకుని ఏడాది ముగిసినా ఎటువంటి ప్రగతికి నోచుకోలేదని పిల్లల విద్యాభ్యాసంకు సమస్యగా మారిందని పేర్కొన్నారు. భార్యభర్తలు వేర్వేరు ప్రాంతాలలో పని చేసేవారికి, మాజీ సైనికులకు మాత్రమే బదిలీల వెసలుబాటు కల్పించారని పేర్కొన్నారు. పోర్టల్ ప్రకారం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేదని పోలీసు కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ స్థాయిలో పనిచేసే వేలాది మంది సమస్యను తీవ్రంగా పరిగణించాలని లేఖలో పంపినట్లు సమాచారం. ఇప్పటికే సదరు లేఖను డీజీపీకు పంపిన తర్వాతనే రాష్ట్రపతి కార్యాలయంకు పంపినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన లేఖ సోషల్‌మీడియాలో గురువారం వైరల్ అయ్యింది.

కలబురగి జిల్లాలో బీజేపీ కార్యకర్త దారుణహత్య



గిరీష్‌చక్ర (ఫైల్)

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లాలో మరో బీజేపీ కార్యకర్త దారుణహత్యకు గురయ్యాడు. కలబురగి ఎంపీ ఉమేష్‌జాదవ్ ప్రధాన అనుచరుడు, బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు గిరీష్‌చక్ర(31)ను మారణాయుధాలతో కిరాతకంగా హత్య చేశారు. అఫ్జల్‌పుర తాలూకా సాగనూరు గ్రామానికి చెందిన పొలంలో దారుణం జరిగింది. ఫిబ్రవరి 14న గిరీష్‌చక్రను బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడిగా నియమించిన మేరకు గురువారం రాత్రి మిత్రులు పార్టీ ఏర్పాటు చేశారు. సాగనూరు గ్రామ పరిధిలోని పొలంలో విందుకు ఆహ్వానించారు. రాత్రి పొద్దుపోయాక కళ్ళలో కారంపొడి చల్లి మారణాయుధాలతో దారుణంగా హత్య చేశారు. శుక్రవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలబురగి జిల్లాసుపత్రికి తరలించారు. దేవలగాణగాపుర పోలీసుస్టేషన్ పరిధిలో సంఘటన చోటు చేసు కోవడంతో వారు కేసు నమోదు చేశారు. గిరీష్ చక్రను హతమార్చిన వారు ఎవరు, ఎటువంటి కక్షలు ఉన్నాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పార్టీ లో ఎంతమంది పాల్గొన్నారనేది కీలకంగా మారింది. కాగా గురువారం ఇదే జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు అళంద తాలూకా సరసంబ గ్రామానికి చెందిన మహాం తప్ప ఆలూరు(45) దారుణహత్య జరిగింది. పొలంకు వెళ్ళి బైక్‌పై వస్తుండగా కారులో వచ్చిన వారు అడ్డగించి మారణాయుధాలతో దారుణంగా హత్య చేశారు. దారుణం మరువకముందే మరో బీజేపీ నాయకుడి హత్య చోటు చేసుకోవడం సర్వత్రా భయాందోళలనలకు కారణమవుతోంది.

నేటి నుంచి చిత్రకళాపరిషత్‌లో ప్రగతి దళ వీ జైన్ కళాఖండాల ప్రదర్శన

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కనిపించని ధ్వనుల ఆకారాలు అనే టైటిల్‌తో ప్రముఖ కళాకారిణి ప్రగతి దళ వీ జైన్ పలు కళాఖండాలను ప్రదర్శించబోతున్నారు. ఈ మేరకు ఆమె నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రదర్శన బెంగళూరు చిత్రకళాపరిషత్‌లో మార్చి 2న ప్రారంభమై 6 వరకు కొనసాగనుంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శనను తిలకించే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దకాలంగా ఈ కళారంగంపై విస్తృత పరిశోధనలు చేసిన ఈ వినూత్న పరి కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పరికల్పనా పరిశోధనలకుగాను ప్రగతి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ ప్రదర్శన అనుభూతిని సందర్శకులు స్వయంగా అందుకోవాలని ఎంతవర్ణించినా తక్కువేనని ప్రకటనలో తెలిపారు.


వ్యాయామంపై జాగృతి

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలను జాగృత పరిచేందుకు, వ్యాయామంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటీవలి కాలంలో పరుగు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందులో భాగంగానే నగరంలో ఖేలోమోర్, ప్రెస్టీజ్ గ్రూప్ ఆధ్వర్యంలో శాంతినికేతన్‌లో 'పీఎస్ఎన్ రన్ ఫర్ ఏ కాజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 1500 మందికి పైగా ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వసూలయ్యే నిధిని బలహీన వర్గాలకు చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో అందజేయనున్నట్లు సంస్థ నగరంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. 1 కిలోమీటర్ నుంచి 10 కిలోమీటర్ల దూరం వరకు నిర్వహించిన ఈ రన్‌లో పిల్లలు, యువకులు, పెద్దలు తమ ఫిట్‌నెస్‌ను సైతం లెక్కించకుండా ఉత్సాహభరితంగా పాల్గొన్నారని ప్రకటన పేర్కొంది. ఖేలోమోర్ సహసంస్థాపకుడైన క్రికెటర్ జతిన్ పరాంజపెతో పాటు పలువురు ప్రముఖులు ఈ సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపింది. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో తొలిసారి 105 ఎకరాల ప్రదేశంలో ఏర్పాటైన ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో ఏర్పాటైన రన్ కార్యక్రమంలో పాల్గొన్న అందరినీ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు తోడ్పాటునందించేందుకు లభించిన స్పందన తమను ఎంతగానో ఉత్తేజపరిచిందని సంస్థ తమ ప్రకటనలో పేర్కొంది.

తహసీల్దార్ కార్యాలయంలో ఇ-పాలనా విభాగం

బాగేపల్లి, మార్చి 1: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాగితరహిత పాలనకోసం ఇ-పాలనా విభాగాన్ని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అర్జీలను ఆన్‌లైన్ ద్వారా ఇక పరిష్కరించనున్నారన్నారు. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లక్ష్యాన్ని దశలవారీగా అమలవుతున్నాయన్నారు. ఇకపై అర్జీలకోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని నిర్ణీత గడువులోగా పరిష్కారం అవుతాయన్నారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ ప్రజల సమస్యలలో జాప్యాన్ని నివారించే ఉద్దేశ్యంతో మంత్రి సూచన మేరకు ఇ-పాలనా విభాగం తాలూకా స్థాయిలో ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో గ్రేడ్-2 తహసీల్దార్ సుబ్రమణ్యం, ఉపఖజానాధికారి శ్రీనివాస్, చేళూరు నూతన తహసీల్దార్ ఏవీ శ్రీనివాస్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది ప్రీతం, రంజిత రోషిణి, భారతి, కార్యసువర్ణ, బీవీ వెంకట రవణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడుకి అంతర్జాతీయ పురస్కారం



ప్రశంసా పత్రం

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి చెం దిన ప్రముఖ సమాజ సేవకుడు కర్ణాటక బహుజన ఫెడరేషన్ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీహెచ్ శంకర్‌కు 2024 సంవత్సరానికి గాను జెనెసిస్ ఇంటర్నేషనల్ అచీవర్స్ అవార్డు లభించింది. భారత్‌కు చెందిన మహేజ్ ఫౌండేషన్, జెనెసిస్ అల్టిమా దుబాయ్ - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, హెగ్డే గ్రూప్ - దుబాయ్ ఆల్ ఇండియా - ఎన్‌జీఓ కౌన్సిల్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ సమాజసేవలకు ప్రతి యేటా ఈ అవార్డులను అందజేస్తున్నారు. దుబాయ్ ఫిబ్రవరి 25న జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి అనివార్యకారణాల వల్ల తాను హాజరుకాలేకపోయానని నిర్వాహకులు తనకు ప్రశంసా పత్రాన్ని పంపించారని శంకర్ నగరంలో శుక్రవారం మీడియాకు చెప్పారు. తనకు అంతర్జాతీయ పురస్కారం దక్కడం ఇదే మొదటిసారి అని ఇది తనపై బాధ్యతను మరింతగా పెంచిందని చెప్పారు. ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పాలసీబజార్ సలహా మండలికి ముగ్గురు పారిశ్రామిక వేత్తలు

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీమా పాలసీల అవసరాలను పరిష్కరించే వేదికగా వ్యహరిస్తున్న పాలసీబజార్ ఫర్ బిజినెస్ సలహా మండలికు ముగ్గురు పారిశ్రామిక వేత్తలను నియమించినట్లు ప్రకటించింది. దినేష్ వాఘేలా, ఎవీరావ్, ఎస్ నాగరాజులు కొత్త సలహా మండలి సభ్యులుగా చేరారు. గత ఏడాది ఓరియంట్ ఇన్సూరెన్స్ జీఎం అజిత్‌కుమార్‌ను నియమించుకున్న విషయం తెలిసిందే. బీమారంగంలో 37 ఏళ్ళ అనుభవం కలిగిన వారిని సలహాదారులుగా తీసుకోవడం ద్వారా వ్యాపార విస్తరణ చేయదలచినట్లు పాలసీ బజార్ ముఖ్యులు సజ్జా ప్రవీణ్‌చౌదరి ప్రకటించారు. దినేష్‌వాఘేలా బీమా కంపెనీలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరించారన్నారు. కొత్త సభ్యులు ముగ్గురు కనీసం రెండున్నర దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన వారే అన్నారు. బీమా, క్లెయిమ్‌ల నిర్వహణ, మార్కెటింగ్ రంగాలతో పాటు కొత్త పాలసీలను తీసుకువస్తామని చౌదరి వెల్లడించారు.